# అతిథిరాలేదు




పాకెట్లో విన్పిస్తున్న కలకలం విని అల్లుతున్న స్వెట్టర్ ప్రక్కనపెట్టి వీధిలోకి వచ్చింది రాధ. కాంపౌండులో పిల్లలంతా అల్లరిగా అరుస్తున్నారు. పక్కింటి ఏడేళ్ల శశి పెద్ద ఆరిందాలా చేతులు త్రిప్పుతూ, "నువ్వూ, నేనూ పెద్ద వుజ్జీం మోయీ" అంటోంది ఎదురింటి అరుణతో. శశి తమ్ముడు వాళ్లేళ్ల రవి మధ్య మధ్య అడ్డు తగుల్తున్నాడు. "అబ్బ నువ్వేమిటిరా మధ్య బుడంకాయలా" అవతలకి లాగేస్తూ అంది శశి. వాడేడుపు ముఖంపెట్టేటప్పటికి "అలాగే వుందు గానిలే సత్రకాయవి నువ్వు". వాళ్ల ఆటలు, మాటలు చూస్తూ చిన్నగా నవ్వింది రాధ. శశి పరుగువచ్చి, "పిన్నీ! పిన్నీ! చేయి చాపు" అంది. అసంకల్పంగా చేయి చాపుతూ, "ఏమిటే" అంది. చేతిలోనున్న బొగ్గుముక్కతో గబగబ రాధ అరచేతిలో చిన్న చిన్న గీతలు గీయడం మొదలెట్టింది. "ఛీ ఛీ ఏమిటది?"

"ఏం లేదు పిన్నీ! 'సన్నా కుప్పా—సన్న బియ్యం' అన్న ఆట. అరుణ జట్టు వాళ్లొచ్చి వెదుకుతారుగానీ చూపకేం"

"ఇదేం ఆటే—పిచ్చాట" అంది రాధ.

"పిచ్చాటకాదు పిన్నీ—చాలా బాగుంటుంది—వాళ్లీ గీతలు కనుక్కోలేరనుకో, వాళ్ల జట్టులో వాళ్లందర్నీ ఎన్ని గీతలు కనుక్కోలేరో అన్ని దెబ్బలు మేం కొడ్తామన్నమాట." "అయిందా" ఎక్కడినుండో అరుణ అరిచింది. "హో—అయిపోయె" అంటూ ఛర్రున పరుగెత్తి 'రెడీ' అంటూ అరిచింది. బిలబిలమంటూ అరుణ గ్రూపంతా వచ్చారు. తలో మూల వీళ్లు వ్రాసిన గీతలకై వెదుకుతున్నారు. పూలకుండీలన్నీ ఎత్తేస్తున్నారు. కిటికీ పూచలనిండా గీతలే. "ఈ పిల్లలు బంగారంగానూ" అనుకుంది రాధ. అరుణ అనుమాన మొచ్చిందానిలా పరిగెత్తికొచ్చి రాధ చుట్టూ చూస్తోంది.

"అత్తా! ఒక్కసారి జరగవూ?"

"ఎందుకు?" అంది రాధ తెలియనట్లు.

"నువ్వు నుంచున్నచోట వ్రాసారేమో చూస్తాను." నవ్వుతూ జరిగింది. అరుణ నిరాశగా పోబోయింది. శశి ముసి ముసిగా గర్వంగా నవ్వుతోంది. ఇంతలో రవి కళ్లూ చేతులు తిప్పుతూ "అక్క పిన్ని చేతిమీద రాసేసిందిగా" అన్నాడు. అరుణ గుప్పిట తెరిచి చూచి "హాయ్ దొరికిందోయ్"

అంటూ సంతోషంగా గెంతడం మొదలెట్టింది. శశి నవ్వు మాయమైంది. ఉక్రోషంగా రవిని పట్టుకుని నాలుగంటించింది. వాడు ఏడ్పు లంకించుకున్నాడు. రాధ కంగారుగా "అరే—ఏమిటది శశీ" అంటూ అడ్డెళ్లింది. "మరి వాడెందుకు చెప్పాలి?" ఇంచుమించు ఏడ్చేస్తోంది శశి.

"అందుకని చంటాణ్ణి పట్టుకుని కొడతారా! తప్పుగదూ—లేదులే నాన్నారా, నీకు బిస్కట్టిస్తా". వాణ్ణి చంకనేసుకు లోపలి కొచ్చింది. బిస్కెట్ డబ్బా చూడగానే అంతే ఏడ్పు ఏమయిందో "ఇన్ని, ఇంకోటి" అంటూ చేయి జాపాడు. అలా ఒకటి తర్వాత ఒకటి అడిగి తింటున్న వాణ్ణి చూస్తోంటే ఎన్నో ఆలోచనలు అల్లిబిల్లిగా రాసాగాయి. రవితో తన పరిచయం ఈనాటిదా? మూడు నెల్ల పిల్లాడుగా ఉన్నప్పుడు ప్రక్కింటి కద్దెకొచ్చారు సావిత్రీవాళ్ళు. వాడు చొంగ కారుస్తూ బోర్లపట్టం తనకి తెలుసు. వచ్చీ రాని మాటలతో 'అత్త—అత్త' అంటూ తన్ని చుట్టు ముట్టడం గుర్తొంది. నడక సరిగా రాక వాడు తప్పటడుగులేస్తూ, పడుతూ లేస్తోంటే తను చెయ్యి పుచ్చుకు నడిపించించిన రోజులున్నాయి. ఈ గడిచిన కాలమానంలో సావిత్రి సంవత్సరం క్రితం మరో బిడ్డ నెత్తుకుంది!

కానీ తను మాత్రం? ఒక్క సావిత్రేమిటి? తనకు గుర్తున్నంత మేరకు అంతా. తన స్నేహితులు, బంధువులు, చివరికి తన పెళ్లయిన మూడేళ్లకు పెళ్లయిన తోటికోడలూ, తనకంటె అయిదేళ్ల చిన్నదైన తన చెల్లెలూ అంతా బిడ్డల్నెత్తారు. తనుమాత్రం ఆనాటికీ నాటికీ వూయని తీవే!

రాధ కళ్లలో నీళ్లు చిమ్మాయి. తప్పు చేసిన వారికి భగవంతుడు శిక్ష విధిస్తాడంటారు. తానేం తప్పు చేసింది. తనకి తెలిసినంతవరకూ తనెవరికీ కీడు చేయలేదు. మీదు మిక్కిలి మేలే చేసింది. మరి తన ఏ తప్పు కీ శిక్ష? "అరే! ఏ లోకంలో ఉన్నావు? స్కూటరు హారను, అది ఆగిన చప్పుడూ, నా బూట్ల టకటకా అన్నీ విన్పించకుండా," కృష్ణమోహన్ నవ్వుతూ లోపలికొస్తూనే అడిగాడు. ముఖం ప్రక్కకు తిప్పుకుని కన్నీటిని కనబడకుండా తుడుచుకుంది.

కృష్ణ ఆమె రెప్పల్ని చూడనే చూశాడు. "ఎందుకు?" నిరాశ కొట్టవచ్చినట్లు విన్పిస్తోంది కంఠంలో. "ఏమీలేదు, పదండి కాఫీ త్రాగుదురుగాని—" లోపలికి నడిచింది. కృష్ణ కళ్లు, కుర్చీలో కూర్చుని బుద్ధిగా బిస్కట్లు తింటున్న రవివైపు తిరిగాయి. అర్థమైనట్లు తల పంకించాడు. ఇక మాట్లాడినా ప్రయోజనంలేదు. అసలు మాట్లాడటానికి తన గొంతే మూగబోతుంది. ఏ జన్మలో—తామిద్దరిలో ఎవరు చేసిన పాపం యిది? తన శక్తి వంచన లేకుండా అన్నీ చేసాడు. రెండు సార్లు ఆపరేషన్ చేయించాడు. ఎవరికి చూపించినా పిల్లలు కలుగుతారని చెప్పటమే కాని కలగరు అని ఒక్కమాట చెప్పరు. నిరాశగా నిట్టూరుస్తూ తనూ లోపలికి నడిచాడు.

కాఫీ తీసుకు లోపలికి వచ్చిన రాధని చూస్తూ "పేరంటానికి వెళ్లలేదూ" అన్నాడు మాట మార్పుకోసం. "ఊహూఁ నేను వెళ్లనని తెలీదూ?" తెలుసు! అసలీమధ్య రాధ ప్రవృత్తే మారిపోయింది. ఎక్కడికీ వెళ్లదు. ఎవరితోనూ కలివిడిగా ఉండదు. ఒక్కొక్కపుడు తనకే—పెళ్లయిన మొదటి సంవత్సరంలో తన చిలిపి చేష్టలతో తన్నంతగా అల్లరి పెట్టిన రాధేనా? అన్పిస్తుంది. ఒకసారి అప్పటికీ అడిగాడు.

"నా కిష్టం ఉండదు. వాళ్లందరి మధ్య ఏదో అనర్హురాలిలా ఫీలవుతాను. కలకల్లాడే పాపలతో, బ్రతుకంతా నిండిన సంతృప్తితో వాళ్లంతా వుంటారు. నేను మాత్రం మొండిదానిలా నిలబడి పోవాలి. ఒకవేళనే నిలబడి పోగలిగినా వాళ్లూరుకోరు. 'పిల్లలెంతమంది? పెళ్లయి ఎన్నాళ్లయింది?' యిలా ప్రశ్నలు! అంతటితో వూరుకున్నా బాగుణ్ను. 'పాపం ఆపరేషన్ చేయించుకోబోయావా? అయినా ప్రాప్తం ఉండాలి! యిలా రిమార్కులు." నిజమే! వయస్సు ముదిరి పెళ్లికాని కన్నె పిల్ల పదిమందిలోకీ వెళ్తే ఎలా చూపుల్నెదురు కోవాలో—పెళ్లయీ ఎన్నాళ్లకీ తల్లికాలేనీ ఆడదీ అంతే! కాని మొదటిది సంఘానికి సంబంధించినది. రెండవది మనస్సుకి! వాళ్ల మాటలూ, విమర్శలూ వింటుంటే నిజంగా తానపూర్ణమయిం దేదో కోల్పోయిం దేమో నన్పిస్తుంది. జాలిగా, రాధ కళ్లలోకి చూశాడు. అవి బలవంతాన కన్నీటిని అపుకుంటున్నట్లు చెప్పకనేచెప్తున్నాయి.

"ఛీ పిచ్చిదానా ఎందుకు!" మృదువుగా చేయి పట్టుకుని పక్కన కూర్చోబెట్టుకుంటూ అడిగాడు. ఆత్మీయత శీతల సమీరంలాటిది. మేఘం బ్రద్దలైనట్లు రాధ హృదయం హెచ్చిల్లింది. వాక్యాల కందని వేదన అది. ఏడ్పుకాదు ఆక్రోశం! కళ్లనుండి కారే నీరు కొద్దికాని బ్రద్దలయే హృదయం నుండి పారే వేదనా లహరి ఉధృతం. "ఛ! ఛ! తప్పుకదూ ఏమిటి ఉన్నట్లుండి ఏమయింది చెప్పు?" ఇది నెలకోసారి చర్విత చర్వణమే! నెలంతా ఏదో కనబడని దానిపైన ఆశ పెట్టుకోడం, నెలకాగానే ఆ ఆశ కేవలం పేరాశ అని తేలగానే నిబ్బరించుకోలేక తనలో తాను ఏడ్వటమో, లేక అతని వడిలో వాలిపోవటమో రాధకి మామూలే. బలవంతాన నిగ్రహించుకుంటూ "ఏమీలేదు—నన్ను నే నిగ్రహించుకోలేనపుడు యిలా విలపిస్తూ ఉంటాను." "యిపుడేమయింది?" ఓదార్పుగా అంటున్నాడేకాని అతని కంఠమే రుద్ధమయింది.

"ఆవేదన—" అస్పష్టంగా అంది. కృష్ణ ఏదో అనేంతలోనే "కొన్నిటికి మనం అనర్హులమని తెలిసినా కూడా ఆ వస్తువుపట్ల వుండే ప్రీతి మనల్ని పిచ్చివాళ్లని చేస్తుం దనుకుంటాను." "ఏమిటీ ఆవేదన! నాతో చెప్పలేని ఆవేదన ఉంటుందా?" చటుక్కున కన్నీరు తుడుచుకుని యథాస్థితికి వస్తూ "యితర వ్యాపకాలతో నన్ను నేనెంత మర్చిపోవాలనుకున్నా నెలకోసారి నాకీ వేదన తప్పటంలేదు" అంటూ లేచి కప్పు చేతిలోకి తీసుకుని "చల్లారి పోయింది మళ్లీ తెస్తానుండండి" అంటూ వెళ్లింది. 'అవును! జీవితమే చల్లారి పోయింది' నిస్తేజంగా శూన్యంలోకి చూస్తూ అనుకున్నాడు కృష్ణ. అతని కళ్లలో నీళ్లు తిరిగాయి. మనిషికిమంచే శత్రువు కావచ్చు. కాకపోతే లోకంలో దుష్టులు, దుర్మార్గులు, గాడితప్పినవాళ్ళు అందరికీ లభించే యీ ఆనందం, అదృష్టం తమకి మాత్రం ఎందుకు అలభ్యమవుతోంది?


మర్నాడు ఆఫీసుకు వెళ్లేందుకు తయారవుతున్నాడు కృష్ణ. ప్రక్కనే నిల్చుని పెన్‌లో యింక్ పోస్తోంది రాధ. "మీరసలు పొరబాటు చేసారు" ఉపోద్ఘాతం లేని యీ వ్యాఖ్యాన మేమిటా అనుకుంటూ తలెత్తాడు. అతనివైపు చూడకుండానే, "మీరు పెళ్లికి ముందరే డాక్టరు చేత నన్ను పరీక్ష చేయించి మరీ చేసుకు ఉండాల్సింది."

"పిచ్చిగా వాగకు." ఇంక్ పోయడం ఆపి తలెత్తింది. కృష్ణ కళ్లలో ఎర్ర జీర—అమాయకంగా సర్వం కోల్పోయి

న్నట్లు రాధ ముఖం, దేనితోనూ సంబంధం లేనట్లు, తనకేం చెందనట్లు నిర్లిప్తంగా వున్న ఆ కళ్లు చూడగానే కృష్ణ కళ్లు చెలిపోయాయి. ఈమధ్య రాధ మాట్లాడే మాటలకి అర్థం ఉంటం లేదు. ఆమధ్య ఒకసారి తలకి నూనెరాస్తుంటే పొరబాటున నూనె చుక్క చొక్కామీద రాలింది. తను నవ్వుతూ— "ఇప్పుడే

## అతిథి రాలేదు

మడత విప్పాను. 40 రూపాయల టెరిలిన్ షర్టు గంగలో కలిపావుకదా" అన్నాడు సరదాగా. "క్షమించండి. నాకు నూనె బాగా రాయటంరాదు. నాకేం పిల్లలున్నారా అలవాటుండటానికి?" తడుముకోకుండా అంది. తనకి నోట మాట రాలేదు. ఇదేమిటి? అందరికీ పిల్లలుంటేనే అన్ని పన్లు వస్తున్నాయా? అయినా ఇది మొదటి రోజుకాదే. యిన్నాళ్లు బట్టీ లేని పొరబాటు ఈనాడు పిల్లల్లేకపోవటంతో వస్తోందా? కాని ఆ మాటల వెనుక వున్న వేదన తనకి తెలుసు. అందుకే తన మనసు ఆర్ద్రమయింది. చటుక్కున దగ్గరికొచ్చి బుజంపై చేయివేసి లాల



నగా. "ఎందుకలా మాట్లాడ్తావు? ఏడేళ్ల దాంపత్య జీవితం ఏమంత బాధాకరమూ, నిరాశాపూరితమూ అయిందని ఆ నిస్పృహ?"

"ఏమో నాకు తెలీదు. పెళ్లయిన మూడేళ్లకి కొడుకంటూ ఉండాలి అనుకున్నాను, రాలేదు. బహుశః ఇకమీద కలిగినా నాకు సంతోష కరం కాకపోవచ్చు!" ఇదేమి మనస్తత్వం? చేటుకున్న చుబుకం పట్టుకు పైకెత్తాడు. రాధ కళ్లలో తను ఎంతో కష్టపడి వ్రాసిన కథ తిరిగొచ్చినపుడు—సంవత్సరమంతా కష్ట పడి చదివినపుడు, తీరా పరీక్షల ప్రైవేకి టైఫాయిడ్ వచ్చి వ్రాయడానికి వీల్లేక పోయినపుడు కన్పించిన నిరాశా భావమే ఈనాడు కన్పిస్తోంది. పిచ్చిరాధ! ప్రతిదీ అతిగా వూహించుకుంటుంది. అంతా సిద్ధాంతాల ప్రకారం వెళ్లాలంటుంది. సమాధాన పర్చటానికి మారుగా పరిహాసంలోకి దింపుతూ, "ఇది మరీ బాగుంది. పదిహేనేళ్లకి పెళ్లి కావాలనుకున్నా—పద్దెనిమిదేళ్ల యింది కనక మొగుడక్కర లేదన్నట్లుంది."

"అదంతా నాకు తెలీదు—నాలో మొగ్గ తొడగనేకూడదు. కాని తొడిగిందా పువ్వు అయితీరుతుంది."

"ఉత్త పిచ్చిదానివి! ఇది శాస్త్రమనుకున్నావా సిద్ధాంతాల ప్రకారం రెండు రెళ్లు నాల్గవటానికి. జీవితం! మనకి యిష్టమయినవి ఎలా హృదయపూర్వకంగా ఆహ్వానిస్తామో యిష్టంలేనివీ అలాగే మన్నించ గలగాలి! అయినా చూడు—యింట్లో కూర్చుని ఒంటరిగా వెర్రి వెర్రి ఆలోచన లెక్కువవుతున్నాయి. అలా సాయంత్రంపూట ఎటన్నా వెళుతూ ఉండరాదు?" అన్నాడు. "ప్రయత్నిస్తాను" అంది రాధ.


ఆ సాయంత్రం తిరిగి తీరిగ్గా కూర్చునేటప్పటికి ఎప్పటిలా ఆలోచనలు క్రమ్ముకురావటం మొదలు పెట్టాయి. ప్రొద్దున్న కృష్ణ అన్న మాటలు గుర్తొచ్చాయి. నిజమే! చేతికందని దాన్ని గూర్చి పూరి తలపోస్తే ఫలిత మేమిటి? అనుకుంటూ లేచి నడక సాగించింది. చల్లగాలి కాలువ గట్టమ్మట నడుస్తూంటే ప్రాణం లేచొస్తోంది. నడుస్తున్న దల్లా ఎదురుగా అందంగా కన్పిస్తున్న తోట, చిన్న కుటీరం చూసి ఆగిపోయింది. అబ్బ! ఆ తోటలో లేని వృక్ష జాతిలేదు. చేమంతు లెంత అందంగా విరబూసాయి. గులాబి కన్నెలెంత చక్కగా వున్నాయి. ఎవరో వృద్ధుడు, బహుశః మాలి కావచ్చు, ఓపిగ్గా వాటన్నిటికీ నీళ్లు పోస్తున్నాడు. మరో ముసల్ది మళ్లు సరిజేస్తోంది. "పాపం! ఆ వయసులో ఎందుకో ఆ కష్టం" అన్పించింది. చీకటి పట్టులో వెనుదిరిగి అలా తిరిగి రావటంలో కొంత మనశ్శాంతి చిక్కినట్లయింది. రోజూ నడక అలవాటయింది. కాని ఆ పాక దగ్గరికి రాగానే కాళ్లు అప్రయత్నంగా ఆగిపోయేవి. అంత ప్రశాంత వాతావరణంలో వున్న వాళ్లెంత హాయిగా ఉంటారో ఒక్కసారిచూస్తే, మాట్లాడ్తే! చివరికో రోజు ఆపుకోలేక గేటు తరచుకుని నెమ్మదిగా ఒక్కడుగు బెట్టింది. మొక్కలికి నీళ్లు పోస్తున్నాయన తలెత్తి,

"ఏం కావాలమ్మా" అన్నాడు. తడబడింది రాధ.

"ఏం లేదండీ. తోట అందంగావుంటే చూద్దామని"

"అలాగే రామ్మా! ఒసేవ్ యిలారా" లోపలినుంచి ఆ ముసలావిడ నడుచుకుంటూ వచ్చింది. పండిపోయిన తల! కాని ముఖంలో ఎంత కళ. అయితే ఈ ఇంటికి యజమానులు వీరేనన్నమాట. యింకా నయం. పిచ్చిగా అడిగాను కాదు అనుకుంది. ఇలా అయిన పరిచయం గాఢతరమవుతోంది. ఒక్క అరగంట సేపు పిచ్చాపాటి చెప్పుకుంటూ ఆ తోటలో కూర్చోకపోతే పిచ్చెక్కినట్లుంది. ఎన్నాళ్ల పరిచయమయినా, ఆ యిల్లూ, వాతావరణం ఏమిటో కొత్తగా, తనూహించలేని, తన కందని ఉన్నత స్థాయిలో ఉన్నట్లుంటాయి. ఆ దంపతుల నిరాడంబరత. ఈ వయసు కూడా కష్టపడగల వోపిక, అన్నిటికీమించి వారి మధ్య గూడు కట్టుకున్న ఆ అపూర్వమైన అన్యోన్యం అను రాగం!!! వాళ్ల ముఖాలపై చిరునవ్వు లేకపోవడం తానెన్నిటూ చూడలేదు. వారికి బిడ్డల్లేరట. ఆ బాధ మచ్చుకైనా కన్పించదే! ఏడేళ్లకే తన్నింతగా పీడిస్తున్న ఆవేదన మచ్చుకైనా ఆమెలో చూడలేదు తను. ఒకనాడు తాతగారు యింట్లో లేక పోవటంచూసి ఆమెని అడిగింది. "పిల్లలు లేకపోయినా మీరింత నిర్వికారంగా ఎలా ఉండగల్గుతున్నారు. లేక అసలు వాళ్లుండాలనిపించదా!" అని.

"ఎంత తెలివి తక్కువ ప్రశ్న వేశావు. కోకిలకు పాడాలనిపించదా! పువ్వుకి వికసించాలనిపించదా! అన్నట్లుంది. ప్రకృతిలో అతి సహజమయిన వీటికి విరుద్ధంగా జరుగదా అని, జరగాలనుకోటంలాటిదే స్త్రీకి మాతృత్వవాంఛ లేదనుకోటం కూడా. నా నోములన్నీ నిరాకరించి, నే చేసిన ప్రతి ప్రయత్నాన్ని విఫలంచేసి భగవంతుడు డాక్టరు రూపాన నీ కింక తల్లి అయ్యే యోగం లేదని చెప్పిననాడు, నా హృదయమే స్తంభించింది. నాలోని సర్వ శక్తులూ అణిగిపోయాయి. నేనింక దేని కోసం బ్రతకాలి. అసలీ ప్రపంచంలో నాకేం వుందో నాకే అర్థం కాలేదు. అతి సామాన్యమయిన ప్రేమ విఫలత, ఆర్థిక సమస్యలూ, ఆప్తుల మరణాలు, మనుష్యుల



# అతిథి రాలేదు

...ఎందుకు విపరీతుల్ని చేస్తాయి? జీవితంలో యింతకంటె, మించిన వేదన వేరొక్కటుంటుందా? ఆడదాని ఆశకే రూపం యివ్వకుండా, దాంపత్య జీవితంలోని అనురాగానికి ప్రతిరూపంగా నిలవకుండా, ఎక్కడినుండో పూరిస్తూ, అందని ఆకాశ పుష్పంగా నిలిచిపోతుంటే వేగిపోతున్న స్త్రీ హృదయానికి మిగిలేదేమిటి? క్రొత్త కోర్కెలు పుత్తెక్కిస్తుండగా, ఒక విచిత్రమైన అనుభూతిలో అందంగా, కనురెప్పలు సిగ్గుతో వాలిపోతుండగా "మనం తల్లి దండ్రులం కాబోతున్నాం" అని చెప్పటానికి మారుగా స్త్రీత్వానికే గొడ్డలి పెట్టుగా, "నాకు పిల్లలు పుట్టరు" అని చెప్పవలసిన దారుణ పరిస్థితికి,ఆ పరిస్థితి నుంచి స్త్రీకి కల్పించవద్దనీ విలవిల్లాడిపోయాను. ఇంట్లోవున్న కుక్క పిల్లని, పిల్లలు లేకపోతే తేలికగా చూస్తాసే! నాటిన చెట్టు ఒక్కపూవైనా పూయక మోడుగా నిలిచిపోతే నిరసనగా నరికివేస్తాసె. అటువంటిది స్త్రీ! తల్లిగా తన మాతృప్రేమలో విశ్వాన్ని పులకింపచేయగల ఆడది! నా పాలిట ఆ కోర్కె కూడా గగన కుసుమమే అయినపుడు నా దురదృష్టానికి హద్దెక్కడ? ఏ మహత్తర స్థానంవల్ల స్త్రీత్వానికి పరిపూర్ణత సిద్ధిస్తుందో! ఏ కార్యసాధనవల్ల స్త్రీ పుణ్యమూర్తి పూజనీయురాలుఅవుతుందో,ఆసాకర్యానికి నేను అనర్హురాలినని తెలిసినపుడు ఒక విధమైన నిస్సహాయత, అసమర్థత, సిగ్గరితనం నన్ను నిలవనీయలేదు. అసలు జీవించటానికే అసమర్థురాలననిపించింది. చేపట్టిన స్త్రీవల్ల, ఆమెనుండి లభించే సంతతివల్ల యిహలోకంలోతృప్తిని, శాంతిని, పరలోకంలో పుణ్యగతులనూ పొందవలసిన పురుషుడు, కేవలం 'నా చేతకానితనం' కారణంగా కటువం బ్రతుకులోని విందు దనాన్ని అనుభవించలేకపోవటం, నన్ను మరింత బాధించింది. అందుకే వారొత్రి పగిలిపోతున్న హృదయాన్ని చేత బట్టుకుని అర్థించాను "—మీరు కూడా నాతోబాటు ఎందుకలా బాధ పట్టం? మీకు అవకాశం వుంది. నేను హృదయపూర్వకంగా అంగీకరిస్తున్నాను. తిరిగి వివాహం చేసుకోరాదూ, అని".

"సీతా!....." అది ఆయన అరచిన అరుపో, మేఘాల్లోని ఆకాశం గర్జించిన ఉరుమో అర్థం కాలేదు. కాని ఆయన కళ్ళల్లోకి చూడగల ధైర్యం మాత్రం లేకపోయింది. "ఎంత తేలికగా మాట్లాడావు? పవిత్రమైన సతీ పతుల అనుబంధాన్ని సంతుతో ముడిపెడుతున్నావా? అయితే ఒకవేళ నేనే దీనికి అసమర్థుణ్ణయి వున్నట్లయితే నీవా పని చేసి ఉండగలిగేదానివా?" ఏమని సమాధానం చెప్పను? ఆయన స్థానమూ, నా స్థానమూ ఒక్కటా? అనాదినుంచి ఆడదానిని విధి, సంఘం, మనుష్యులూ, అణచి వేస్తూనే వున్నారు. అన్ని విధాలా అన్యాయం చేస్తూనే ఉన్నారు. కాని దేన్నైనా ధిక్కరించగల ధైర్యమూ, అవకాశంగల మొగవాడెందుకు తలవంచాలి! "అందుకని నా అంతర్యాన్ని మోసగించుకోమంటావా? సీతా నువ్వెపుడు కంట తడిపెట్టినా నా అనురాగాన్ని అవమానించినట్లే భావిస్తాను." అన్నారు. ఆ తర్వాత మనిషిగా మనగలిగానంటే-ఆనందంగా తిరగగలిగానంటే కారణం ఆయన అచంచల అనురాగం? ఆ ప్రేమ మచ్చలేని చందమామ. మలినంలేని గంగిగోవు. నన్ను తిరస్కరించగలిగి కూడా, తన ఔదార్యాన్ని ప్రదర్శించారు. తన ఔదార్యపు కంచుకోటకట్టి నేను తూలిపోకుండా చేశారు. ఇంకా నే బాధపట్టం వ్యర్థమూ అవివేకమూ అన్పించింది! కాయలు కాయకుండా ఎన్ని చెట్లు రాలిపోవటం లేదు. పువ్వులు పూయకుండా ఎన్ని మొక్కలు వాడిపోవటంల్లేదు, ఎవరికీ ఏ విధంగా ఉపయోగపడకుండా ఎన్ని పిల్లకాల్వలు, దాటిపోవటల్లేదు. అల్లాగే ఈ జీవన మహాసముద్రంలో యీ సీత, ఒక్క చిన్న నీటి బిందువు మాత్రమే—ఏనాటి మహా ప్రవాహానికన్నా భూమిలో కలిసిపోవచ్చు, లేదా ఎండ వేడిమికి ఆవిరైపోవచ్చు! అందుకే నన్ను నువ్విలా చూడగలుగుతున్నావమ్మా. కాని.....కాని ప్రభంజనాన్ని గుప్పిట, దావానలాన్ని గుండెల్లోనూ దాయగలమా? అంతరాంతరాలలో ఎన్నడో నక్కిపోయినా ఆ కోర్కె అపుడపుడు బయల్వెడలుతూనే ఉంటుంది?" రాధ స్థాణువే అయింది. అవ్వగారు పెడుతున్న వెక్కిళ్ళు వినవస్తూనే ఉన్నాయి. దానికి కారణం తనే అయినప్పటికీ ఓదార్చాలని తోచలేదు. శూన్యంలోకి చూస్తూ ఉండిపోయింది. తెప్పరిల్లుకుని చూసేటప్పటికి ప్రక్కన అవ్వగారి బదులు తాత గారు కన్పించారు.

"నాకు తెలుసు! మమ్మల్ని చూసిన ఎవరికైనా ఈ సందేహం వస్తుంది—! అందుకే అందరికీ దూరంగా యీ అందమైన వాతావరణంలో దాని మనస్సు ప్రశాంతం చేయటానికి ప్రయత్నించాను! కాని అసలు ఆలోచించిచూస్తే అన్పిస్తుంది. ఆడది చేసిన మహాపరాధమేమైనా ఉంటే—భగవంతుడు విధించే ఒకే ఒక శిక్ష—పెద్ద శిక్ష, తల్లిని కానివ్వకుండా ఉండటమే నన్పిస్తూంది—!" ఉలిక్కిపడ్డది రాధ! "నా లాలనతో దాన్ని మరిపించగలిగానేమోకాని దానిచే ఆ విషయం మరిచిపోయేట్లు చెయ్యలేకపోయాను. ఏం చెయ్యను? ఎంతయినా అది ఆడది! జన్మ జన్మల ఆడదాని అంతర్యపు ఆవేదనే అది!!!" తాతగారు చెప్పుకు పోతూనే ఉన్నారు—కాని రాధ సెలవు తీసుకుబయటపడ్డది. అడుగులు తూలిపోతున్నాయి—! "ప్రభూ, నిత్యానంద స్వరూపా! తప్పు చేసిన ఆడదాన్ని శిక్షించటానికి నీ కింకో విధానమే దొరకలేదా? ఆడదానికి మిగిలే ఆ మేలైన ఆనందాన్ని వంచించాలా? ప్రపంచమంతా వంతు తీసుకుని పంచుకునే ఆ సంతృప్తిలో కేవలం తనకిమాత్రం వాటా లేదని తెలిసినపుడు ఏ ప్రాణి నిబ్బరించగలదు! అస లేమిటో తెలియని అన్వేషణ పరిస్థితిలో కలిగే సంచలనం, అనుభూతిని మరేది యివ్వగలదు. చిన్న ప్రాణం తనలో కదలాడుతుంటే ఒక మహా సామ్రాజ్యాన్ని జయించిన మహారాణిలా ఠీవిగా గర్వంగా రూపకల్పన చేసే ఆడదాని మనోరథాన్ని, ఏ యితర ఆనందాలు తీర్చగలవు! పక్కింటి పసిపాప కిలారుమని నవ్వితేనే పరవశించిపోతుందే స్త్రీ హృదయం. అటువంటిది—తన రక్తం పంచుకుని, తన అందాలు సంతరించుకుని, తన స్వరూపాన్ని ప్రోవుగా చేసుకుని, మరోమాటలో తన ప్రతిబింబంగా, తన ఎదుట నిలిస్తే పలికింది పరవశించాలనుకోటం అత్యాశ కాదే! నిర్దుష్ట కారుడివనబడే నీలోనే యింత పక్షపాతం ఉన్నపుడే అంతర్యపు మూగవేదన యింకెవరికర్థమవుతుంది" పట్టు తప్పిన హృదయ వేగం ప్రపంచాన్ని, పరమేశ్వరుణ్ణి కూడ ద్వేషించి, దూషించటానికి వెనుకాడటంలేదు—అచేతనంగా కాంపౌండు లోకి అడుగు పెట్టింది రాధ. ప్రక్కింటి సావిత్రి అపుడే పైపైకి వస్తున్న పొట్టని చూపిస్తూ పాపయికి గోరు ముద్దలు తినిపి...

[illegible]

[illegible]

స్తోంది! అపుడే పాలు తీసి వెళ్ళాడు కాజోలు — లేగ పాలుకుడుచుకోటానికి తంటాలు పడుతుంటే మృదువుగా, ప్రేమగా తన నాలికతో దాన్ని దువ్వుతోంది ఆవు! దెబ్బ తిన్న హృదయంపై మరో దెబ్బ తగిలినట్లయితే—తాళం తీసి అడుగు పెట్టి పెట్టగానే గోడమీద తానెంతో ప్రేమించే బిస్కట్ల కంపెనీ కేలండరులోని ఆపిల్ పండులాటి పసివాడు చేతులెత్తి మరీ ఆహ్వానిస్తున్నాడు—ఎదురుగుండావున్న టేబిల్ పై తానెంతో మోజుపడి కట్టించిన బాలకృష్ణుడి పటం వుంది. రాధకి అవ్వ గారి మాటలు గుర్తొచ్చాయి.

"ఆయన ప్రేమ మచ్చలేని చందమామ." అవును కృష్ణ తననికూడా అంత ప్రేమగానే చూస్తాడు. అంత మాత్రాన తనంత నిర్వికారంగా ఉండగలదా? ఊహూ తనలోని తల్లి కావాలన్న కోర్కె బలీయమయినది. దానిముందు ప్రపంచంలోని ఏ యితర ఆనందాలు, సంతృప్తి తన్ని మనిషిగా నిలబెట్టలేదు—! ఉధృతంగా పరుగులుపెట్టే ఈ ప్రేమ వాహినికి ఆనకట్ట ఎలా ప్రభూ—! తన్ను తాను నిలవరించుకోలేకపోయింది రాధ! ఆ ఫొటోకీ తనకూ అవినాభావ సంబంధం వుంది. బ్రతుకు అంటే పూర్తిగా వూహ తెలీని రోజుల్లోనే ఆ ఫొటోఅంటే తానెంతో మోజు పడ్డది. మనస్సు, భావాలు పూర్తిగా వికసించక పూర్వమే తనకి కొడుకు పుడితే అలా ఉండాలి అనుకుంది. కాని పదేళ్ళ క్రిందటి ఆ కోర్కె విచ్చుకోనేలేదు. తనకి ఆనాటికి ఈనాటికి మిగిలింది ఆఫొటో మాత్రమే! ఉవ్వెత్తుగా వస్తున్న దుఃఖాన్ని ఆపుకోలేక ఆ టేబిల్ పైనే కూలబడిపోయింది!


ఇల్లంతా చీకటిగా ఉంటం చూసి రాధ యింకా షికారునుండి రాలేదేమో అనుకున్నాడు కృష్ణమోహన్. బార్లాగావున్న తలుపులు చూసి మరింత ఆశ్చర్యపోయాడు. లైట్ వెయ్యగానే టేబులు పై వాలిపోయివున్న రాధ కన్పించింది. ఒక్క క్షణం అతని మనస్సు వశం తప్పింది. ఏవేవో రాకూడని ఆలోచనన్నీ ముట్టుముట్టాయి. యీ నిరాశని భరించలేని రాధ ఏ అఘాయిత్యమయినా తల పెట్టలేదుకదా! ఆ ఆలోచన రావటం తడవుగా వున్న వుదుటున టేబిల్ దగ్గర కొచ్చి వాలిపోయివున్న ముఖాన్ని పైకెత్తి 'రాధా' 'రాధా' అని పిలిచాడు ఆత్రంగా.

బదులు పలకని రాధ అతన్ని మరింత కంగారు పెట్టేసింది. గబ గబ డాక్టర్‌కి ఫోన్ చేశాడు. నెమ్మదిగా రెండు చేతుల్తో రాధని ఎత్తుకుని పైకి పడగ్గదిలోకి జాగ్రత్తగా తీసుకు వెళ్ళాడు. ఫోన్ ఆన్‌చేసి తిరిగి క్రిందికి వచ్చేప్పటికి డాక్టర్ నిరంజని వచ్చి వుంది. ఆదరా బాదరాగా "డాక్టర్ వచ్చారా! ఏమిటో దానికి స్పృహ లేదు. పైన పడుకోబెట్టి వచ్చాను. చూడండి డాక్టర్" అన్నాడు. "మరేం ఫరవాలేదు నే చూస్తాగా. మీరు శాంతంగా కూర్చోండి" అంది! దీర్ఘంగా నిట్టూరుస్తూ సోఫాలో కూలబడిపోయాడు మోహన్. పైకి వచ్చిన నిరంజనికి నీరసంగా ఎటో చూస్తున్న రాధ కన్పించింది. చిన్నగా నవ్వుతూ దగ్గరి కొచ్చింది. "అదేమిటి మీ రెప్పుడొచ్చారు?" లేవబోయింది రాధ. "ఇప్పుడే మీ ఆయన ఫోన్ చేశారు. పాపం ఆయ నూరికే ఖంగారు పడిపోతున్నారు—ఏది పడుకోండి" అంటూ పరీక్ష చేయటాని కుపక్రమించింది. రాధకి మతిపోతోంది. ఇదేమిటి తన కేదో పెద్ద రోగం ఉన్నట్లు పరీక్ష మొదలెట్టింది. ఏదో నీరసం, ఆవేశంవల్ల కళ్లు తిరిగాయి. దానికే యింత కంగారా. మరీ పిచ్చాయినయి పోతున్నారు. నిరంజని కొంటెగా రాధ వైపు చూసింది. "అబ్బ ఆయన్నీ, నన్నా యెంత గాబరా పెట్టేశారు. కొద్దిగా బల హీనంగా ఉన్నారు అంతే! ఎంతయినా మొదటికాన్పు కదా"

"డాక్టర్" ఏదో జరగకూడనిది జరిగిపోయినట్లు అరిచింది. చిన్నగా అలాగే నవ్వుతూ "నేను తెలుగులోనే మాట్లాడుతున్నాను. మరీ వివరించమంటారా. మీరు త్వరలో తల్లి కాబోతున్నారు."

అధాటుగా లేచి కూర్చుంది రాధ. ఎవరో వింత వ్యక్తిని చూసినట్లు డాక్టర్ని విభ్రమంతో చూస్తూ, "నిజంగానా. డాక్టర్" అంది తడబడుతూ, మెడిసిన్ బేగ్‌లోంచి ఏవో బయటికి తీస్తూ "అరే యింకా అనుమానమా" అంది నిరంజని. చటుక్కున మంచం దిగుతూ, "అయితే ఇది నే నాయనతో చెప్పాలి!" సిరంజిలో మందు ఎక్కిస్తూ పక పకా నవ్వింది నిరంజని. "దాని కిది సమయంకాదు. మీర్సు మరీ నీరసంగా ఉన్నారు ఉండండి ఇంజక్షను ఇవ్వాలి!"

"మీకు తెలీదు డాక్టర్. ఈ సమయంకై ఎన్నాళ్ళుగా ఎదురు చూస్తున్నానో" అంటూ తలుపు తీసుకు బయటికి వచ్చింది తొందరగా. "అరే మీకొక్కదూ చెప్పేది' నిరంజని కూడా బయటికి వచ్చింది. కానీ అప్పటికే సమయం మించిపోయింది! నీరసంలో తూలిపోతూ, సంతోషంతో తడబడిపోతున్న రాధ అడుగులు మెట్లమీద సరిగా పడలేదు. రెండు చేతుల మధ్య తలపెట్టు కూర్చున్న కృష్ణ తలెత్తేటప్పటికి మెట్ల



'ఏమోయ్! నీ పెళ్ళిటగా ? బాగా జరిగిందా?!'




M&H M&H M&H M&H M&H M&H M&H

BI-COLATES
REGISTERED TRADE MARK
STEARNS

M&H

బై-కొలేట్స్
పైత్యరస ప్రవాహమును, ప్రేగులను సక్రమంగా నుంచి, మలబద్ధమును నివారణ చేయుటకు అనాదినుండి పేరొందిన — "ఔషధము"

MARTIN & HARRIS
PRIVATE LTD.
MERCANTILE BUILDING, LALLBAZAR
CALCUTTA

M&H M&H M&H M&H M&H M&H M&H

# అతిథి రాలేదు

మీద రాధ బంతిలా దొర్లుతుంది.

"రాధా!" కెవ్వుమన్నాడు కృష్ణ.

* * *

ఆ మర్నాడు జనరల్ హాస్పిటల్ స్పెషల్ వార్డు ముందు పచార్లు చేస్తున్నాడు కృష్ణ పిచ్చిగా.

డాక్టర్ నిరంజని, మరో డాక్టరు బయటికి వచ్చారు రెండో డాక్టరు అదోలా కృష్ణని చూసి ముందుకు సాగాడు. నిరంజని దగ్గరగావచ్చి, "ఎంతైనా ఆమె కంత తొందరపాటు, ఆవేశం పనికిరాదు. అప్పటికే వెనకనుండి చెప్తూనే ఉన్నాను."

"క్షమించండి డాక్టర్. రాధది మొదటి నుండి అదే స్వభావం. ఏమాత్రం ఆవేశాన్ని, ఉద్రేకాన్ని సహించలేదు. యిప్పుడెలా వుంది. ఏం ప్రమాదం లేదుగదా!"

"ప్రమాదం! అవును లేదు—! కాని..."

"కాని...." ఏమిటి?" ఆదుర్దాగా అడిగాడు.

"జీవితం ఆమె కిచ్చిన అవకాశాన్ని పోగొట్టుకుంది. అంతేకాదు. అసలా అదృష్టాన్నే చేజేతులా జారవిడుచుకుంది! ఇక ఎప్పటికీ తల్లి అయే యోగం ఆమెకిలేదు."

"డాక్టర్" అది ఆస్పత్రి అన్న సంగతి మర్చిపోయాడు. రాధ! ఏడేళ్ల వైవాహిక జీవితంలోనే పిల్లలు లేరని కుమిలిపోయి తన్ను దౌర్భాగ్యురాలిగా భావించుకుని నరకం అనుభవించిన రాధ యిక జీవితంలో తనకా అవకాశం లేదని తెలిస్తే నిలువ గలదా? బ్రతుకుతుందా? నిద్రలో నడుస్తున్న వాడిలా స్ప్రింగ్ డోర్సు తెరుచుకొని లోపలికి నడిచాడు. మల్లె పూవులావున్న పక్క మీద, తెల్లటి దుప్పటి కప్పుకుని అంతకంటె తెల్లగా పాలిపోయివుంది. రాధ. కృష్ణని చూసి నిర్జీవంగా నవ్వింది. అంతకంటె నిరుత్సాహంగా దగ్గిరికి వచ్చాడు కృష్ణ. చటుక్కుని మంచంపై కూర్చుని ఉద్విగ్నంగా ఆమె చెక్కిళ్ళు, పెదవులు నిమిరాడు. ఎన్ని చెప్పాలనుకున్నా అతని మాటలు గొంతులోనే ఆగిపోయాయి. ఎవరో కళ్లెంవేసి లాగినట్లాగి పోయాడు. ఉప్పెనగా వస్తున్న ఏడ్పును ఆపుకోలేనట్లు ఉన్నట్లుండి ఆమెపై వాలిపోయి, ఆవేశంగా ఆమెని స్పృశిస్తూ "రాధా! అతిథి రాలేదు రాధా! అతిథి రాలేదు!" అన్నాడు గొణుక్కుంటున్నట్లుగా—!